అర్ధాంగే ప్రేయసి

# ★ నాట్యదేవత

రచన
★ టి. చంద్రకళ ★

★

సూర్యుడు పశ్చిమ దిక్కుగా పరుగెత్తుతున్నాడు పవనవీచికలు పరిమళాన్ని తెస్తున్నాయి. కోయిలకన్యక పంచమస్వరంతో ప్రేమగీతిక తియ్యగా పాడుతూంది. కిశోర్, శశికళ ఉల్లాసంగా మాట్లాడుకుంటున్నారు తోటలో. కిశోర్ తమ్ముడు రవికుమార్ పరుగెత్తుకుంటూ వచ్చి "అన్నయ్యా! యిదిగో ఎవరో ఈకాగితం మీ కిమ్మన్నారు" అని తుర్రుమన్నాడు. కిశోర్ దాన్ని విప్పి చదివి నవ్వాడు. ఏమిటది? అంది శశి. రేపు నాట్యకళామండలిలో కళ అనే అమ్మాయి నృత్యం చేస్తుందిట. ఆహ్వానం పంపారు. రేపు మధు యింటికివెళ్ళి వాణ్ణికూడ తోడు చేసుకొని వెళ్దాం." అన్నాడు. శశి మాట్లాడకుండా ముక్తసరిగా వూరుకుంది.

ఆ మరునాటిదినం మూడుగంటలకే కిశోర్ టాయిలెట్ అవుతూ శశిని త్వరగా తయారవమని తొందరపెట్టాడు గాని శశి మాట్లాడలేదు. చప్పునలేచి ముస్తాబవమన్నారు. శశి తలపట్టుకొని "అబ్బా! నాకు తలనొప్పిగా వుందండి ఈరోజు మీ కోర్కెను నెరవేర్చలేనందుకు క్షమించండి నా తల సూరుగొడ్డళ్ళతో కొట్టినట్టుంది. మీరు మధు లత కలిసివెళ్ళండి." అంది శశి. కిశోర్‌బాబు కొంచెం రౌద్రమూర్తి అయ్యాడుకాని చప్పున అక్కడనుండి వెళ్ళిపోయాడు. కిశోర్ వెళ్ళగానే శశి చక్కగా ముస్తాబై తనకొరకు వచ్చినకారులో యిట్టే మాయమైంది ఇప్పుడు తలనొప్పి ఏమైనదో? మనసుంటే మార్గాలెందుకుండవు?

కిశోర్ ఐదుగంటలకు నాట్యప్రదర్శనానికి వెళ్ళాడుకాని, శశిరాలేదని అతనిమనస్సు అందోళన పడ్తూనేవుంది. పాపం! శశిచేష్టలు అతనికేం తెలుసు? అట్లా ఒక అర్ధగంటయ్యేవరకి స్క్రీన్ యెత్తారు- అందరికళ్లు జిగేలుమన్నాయి. కళ నృత్యభంగిమాన్ని చూచి ప్రేక్షకులు తన్మయులయ్యారు ఆమె చాతుర్యాన్ని మెచ్చుకున్నారు. ఆట ముగిసింది కిశోర్ మధుమూర్తిని, లతను విడిచిపెట్టి గబగబ కళను వెతుక్కుంటూ ఆమె దగ్గరకు వచ్చాడు. కళ మేనేజరుగారితో హడావిడిగా మాట్లాడుతూ "నా కింకో ప్రోగ్రాం ఉందండి. త్వరగా వెళ్ళిపోవాలి" అని చరచరా నడిచి వెళ్ళిపోతుంది. కిశోర్ ఆమెత్రోవ కడ్డుగా వచ్చి కన్‌గ్రాట్‌లేట్ చేసి, "మీ అద్భుత నాట్య కౌశల్యానికి ముగ్ధుడనయ్యాను మీ హస్తకమలాల్లో యెంత మృదుత్వంవుంది. మీ ముఖపద్మంలో యెంతసౌకుమార్యం దాక్కుంది. మీ నయనాలలో యెంత జీవకళ వుట్టిపడ్తుంది అని అనేకవిధాల ఆమెను కొనియాడ్డం మొదలెట్టాడు. ఆమె తన అభినందనములను సమర్పిస్తూ నేను అర్జంటుగా వెళ్ళాలండి" అంటూ తనకొరకై వేచియున్న కారులో అదృశ్యమైనది.

కిశోర్ మెల్లగా యింటికివచ్చాడు. శశి దీపం దగ్గర కూర్చొని యేదో నావల్ చదువుతుంటుంది. కిశోర్ మెల్లమెల్లగా ఆమెనుసమీపించి వెనుకనుండి బుజాలమీద చేతులువేసి వంగి ముఖంలోకిచూస్తూ "శశీ, అబ్బ! నేను వర్ణించలేకుండా వున్నాను. కళ యెంతచక్కగా చేసిందనుకున్నావు నృత్యం. ఆ వయ్యారం ఆ రీతి నిజంగా నన్ను ముగ్ధుణ్ణిచేశాయి. ప్చ్. అసలు చూచేపాటి అదృష్టముండొద్దు నీకు లేఛాన్సు పోయిందిలే శశీ! అసలు నిజంగా ఆమెను వర్ణించటానికి తెనుగుభాషలో మాటలు కరువయ్యాయో లేక నేను వర్ణించలేకపోతున్నానో నాకు తెలియటంలేదు." ఇంకా వేయివిధాల పొగిడాడు. శశి మౌనంగా కూర్చుంది. "శశీ! మాట్లాడవేం? అక్కడకు

వెళ్ళటం యిష్టంలేదా?" శశి ఎలక్ట్రిక్ షాక్ కొట్టినట్లు ఆ ...అబ్బే నావంట్లో సుస్తీగావుండటం వల్ల మీతో సరిగ్గా మాట్లాడలేకుండావున్నా. తల నొప్పి లేకుంటే నేనుకూడా వచ్చేదాన్ని వెళ్ళిలెండి. యేంచేద్దాం! కిశోర్ భోజనంచేసి పడుకొని మళ్లీ ఆ కళామూర్తిని దివ్యనేత్రంతో చూస్తున్నాడు. ఆ తేజోవిరాజిత తనభార్య అయి వుంటే తానెంత అదృష్టవంతుడు. ఆమెను పెండ్లాడి ఆమెతో సర్వసౌఖ్యాలు అనుభవిస్తున్న భాగ్యశాలి యెవరోకదా? ఇటువంటి ఆలోచనలతో ఆ రాత్రంతా నోయుగంలా గడిచింది కిశోర్‌కి

మరుసటిదినం టిఫిన్ తీసుకొని, నాట్యకళా మండలి మేనేజరుగారివద్దకు వెళ్లాడు. కిశోర్ మేనేజర్‌తో కళ అత్యద్భుత నాట్యాన్నిగురించి చర్చించాడు. ఆమెయిల్లు చూపించమని ప్రాధేయపడ్డాడు. మేనేజరు తక్షణం డ్రైవరుతో కిశోర్‌ని కళ యింటికి తీసుకవెళ్ళమన్నాడు. కనురెప్పపాట్లో కిశోర్‌ని 'కళానిధి' వద్దకు తీసుకవెళ్లింది కారు. "ఇదేనండి అమ్మగారియిల్లు" అని డ్రైవరనటంతోనే కిశోర్‌బాబు కొయ్యబారిపోయాడు. తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. శశివచ్చి "రండీ" అంది. "శ.. శి .. క...ళ" అన్నాడు. కిశోర్ అప్రయత్నంగా "నీవేనా నిన్న... " యిక మాట్లాడలేకపోయాడు. మీ యిష్టాన్ని కనుక్కోడానికి పెళ్ళయినతర్వాత నా ప్రథమప్రోగ్రాం యిలా జరిగిందండి" అన్నది కొంటెగా అలాగ అంటూ తన అదృష్టానికి మురిసిపోతూ శశి నునుపాటి బుగ్గలమీద వెచ్చగా ముద్దుపెట్టుకొని, కళకొరకు తాను తీసుకువెళ్తున్న బహుమతిని సంతోషంగా శశికళ చేతికందించాడు కిశోర్‌బాబు.


# పెళ్లి పందిరి

## శోభించడానికి చిన్నసలహా

పెళ్ళివారికి విందులతోబాటు వినోదాలుకూడా కలిగించాలంటే మాకు చెప్పండి.

# భరతనాట్యాలు

ఇంపైన సంగీతం సొంపైన న్యాత్యాలు:
కథాకళి, కూచిపూడి, మొదలు ఆధునిక సినిమారకం న్యాత్యాల వరకూ అద్వితీయంగా ప్రదర్శిస్తారు.

శ్రీమతి మణికుమారి, సుగుణ,
సత్యవతి, సూర్యనారాయణ,
బేబీకృష్ణవేణి మొదలగువారు




వివరాలకు

శ్రీ సరస్వతీ నాట్యబృందం
మంగళవారంపేట
రాజమండ్రి